ప్రజాశక్తి
ఆదివారం 12 నవంబరు 2023

25 వరకు డోర్ డెలివరీ మాసోత్సవం

శ్రీకాకుళం అర్బన్ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ శ్రీకాకుళం పార్సిల్ కొరియర్ రవాణా విభాగం ఆధ్వర్యాన డోర్ డెలివరీ మాసోత్సవాలు ఈ నెల 25 వరకు నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్లు మల్లికార్జున రాజు, శర్మలు తెలిపారు. మాసోత్సవాల్లో నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు డోర్ డెలివరీ ర్యాలీని శనివారం నిర్వహించారు. ఈ ర్యాలీలో రెండు డిపోల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, సంఘ నాయకులు, సూపర్‌వైజర్లు ఆఫీస్ సిబ్బంది, కార్గో ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ మేరకు మల్లికార్జునరాజు మాట్లాడుతూ పది కిలోమీటర్ల పరిధిలో 50 కేజీల బరువు వరకు బుకింగ్ చేసిన డెలివరీ పార్సిల్ కొరియర్లను ఇంటి వద్దకు తక్కువ ఛార్జీలతో, సకాలంలో సురక్షితంగా చేర్చగలమన్నారు. ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌టిసి ఉద్యోగులు

పేలుతున్న టపాసుల ధరలు

దీపావళి వచ్చిందంటే చాలు చిన్నారుల నుంచి పెద్దలు వరకు ఒకటే సందడి. ఎంత ధరైనా బాణసంచా కొనుగోలు చేసి ఇంటిల్లపాదీ సంతోషంగా దీపావళి జరుపుకునేందుకు సిద్ధమవుతారు. అందుకే పేలుడు ఘటనలకు తావు లేకుండా ఉంటేందుకు బాణాసంచా విక్రయాలకు ఒకటి, రెండు రోజులు మాత్రమే అనుమతిస్తారు. దీన్ని ఆసరాగా చేసుకున్న వ్యాపారులు ధరలను విపరీతంగా పెంచేస్తున్నారు. దీంతో దీపావళి టపాసులు కొనుగోలు చేయాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఏకంగా అసలు ధరకు రెట్టింపునకు పెంచి అమ్మకాలు చేపడుతుండడంతో ఇవేమీ ధరలు అంటూ కొందరు వెనుదిరుగుతున్నారు. అసలే పండగ, కొత్త దుస్తులు, పిండి వంటకాలు వండుకుందామన్నా మార్కెట్‌కు వెళ్లలేని పరిస్థితి.

ప్రజాశక్తి– జిల్లా విలేకరుల యంత్రాంగం

జిల్లాలో దీపావళి టపాసుల షాపులకు తాత్కాలికంగా అధికారులు అనుమతులు మంజూరు చేశారు. శ్రీకాకుళం నగరంలో 29, రూరల్ మండలంలో 6, గార మండలంలో 4, నరసన్నపేట మండలంలో 7, పోలాకి మండలంలో 4, కోటబొమ్మాళి మండలంలో 5, ఆమదాలవలస మండలంలో 2, బూర్జ మండలంలో ఒకటి, ఎచ్చెర్ల మండలంలో 8, లావేరు మండలంలో ఒకటి, రణస్థలం మండలంలో రెండు, పొందూరు మండలంలో రెండు, జలుమూరు మండలంలో 2, జి.సిగడాం మండలంలో ఒకటి, ఇచ్ఛాపురం మండలంలో ఒకటి, టెక్కలి మండలంలో 4, వజ్రపుకొత్తూరు మండలంలో 4, పలాస మండలంలో 5, మందస మండలంలో 3, కొత్తూరు 2, మందస మండలంలో 2, సంతబొమ్మాళి ఒకటి, సరుబుజ్జిలి ఒకటి చొప్పున తాత్కాలికంగా అనుమతి ఇచ్చారు. వలస వెళ్లిన వారు స్వగ్రామాలకు పండగ పూట చేరుకోవడం వల్ల నుంచి కొనుగోలుతో ఈ షాపులన్నీ కిటకిటలాడుతున్నాయి. ఇతర మండలాల నుంచి చిన్నచిన్న వ్యాపారులు సైతం ఇక్కడే కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో విక్రయాలు చేస్తుంటారు. అయితే మందుగుండు సామగ్రి ధరలు మాత్రం టపాసుల్లా పేలుతున్నాయి.

గతేడాది కంటే రెట్టింపు ధరలకు అమ్మకాలు

గతేడాది రూ.13,00 పలికిన ఫ్యామిలీ ప్యాక్ ధర ఈ ఏడాది రూ.2 వేల వరకు అమ్ముతున్నారు. దీపావళి టపాసులు గతేడాది తారాజువ్వలు ప్యాకెట్ రూ.40కు అమ్మితే ఈ ఏడాది రూ.వందకు విక్రయిస్తున్నారు. సుచ్చుబుడ్డులు రెండు రూ.50 నుంచి రూ.వందకు పెంచేశారు. కాకర్లు గతేడాది రూ.30 ఉంటే... ఈ ఏడాది రూ.80, లక్ష్మీ బాంబులు రూ.110 ఉంటే... ప్యాకెట్ రూ. 250కు పెంచేశారు. 120 షాట్స్ బాక్స్, ఫ్యామిలీ ప్యాక్ బాక్స్ రూ.1200 గతేడాది ఉండగా, ఈ ఏడాది ఏకంగా రూ.2,400 ధరలు అధికంగా ఉన్నాయి. వీటిని కొనుగోలు కోసం వెళ్లే ప్రజలు ధరలను చూసి ఆందోళన చెంది... కొందరు నిరాశతో వెనుతిరుగుతున్నారు. నిర్వాహకులూ గతేడాది టపాసులు విక్రయాలను మూడు రోజుల అనుమతులకు వివిధ రకాల పన్నుల రూపంలో రూ.9 వేలు చెల్లించేవారు. ఈ ఏడాది రూ.30 వేలు చెల్లించామని, దీనికి తోడు సగానికి పైగా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు, రాజకీయ ప్రముఖులకు, చోటామోటా కార్యకర్తలకు ఇవ్వక తప్పడం లేదని వాపోతున్నారు. ఈ నష్టాన్ని వినియోగదార్లపైనే వేయాల్సి వస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరల భారాన్ని మోయలేక ఇంకేమి కాలుస్తామంటూ ప్రజలు నిట్టూరుస్తున్నారు.

బెంబేలెత్తుతున్న ప్రజలు

రేట్లు అధికమే...

పిల్లలకు టపాసులు కొందామని వెళ్తే అక్కడి రేట్లు చూస్తే గుండె గుబేల్ మంటున్నాయి. అయ్యన్ టపాసులు కావాలంటే గతంలో 80 శాతం డిస్కౌంట్ ఇచ్చేవారు. కానీ ఈ ఏడాది 20 శాతం మాత్రమే రిబేటు ఇస్తూ వ్యాపారులు దోచుకుంటున్నారు. గతేడాదికి, ఈ ఏడాదికి 50కి 50 శాతం అధిక ధరలు పెంచారు. ఇలా అయితే దీపావళి ఎలా చేసుకోవాలో!.

– ఆకేటి రమణ, నిమ్మతొర్లాడ, ఆమదాలవలస మండలం

అధికారులు పర్యవేక్షించాలి

మాకు అందుబాటులో టపాసుల విక్రయాలు జరగడం లేదు. మండలంలోని అధిక శాతం జనాభా ఒడిశా నుంచే బాణసంచా కొనుకుంటారు. మా మండలంలో రహస్యంగా కొన్ని విక్రయాలు జరిగినా ధరలు బాంబుల్లా పేలుతుంటాయి. ఒడిశాలో కూడా ఎక్కువ ధరకే కొంటున్నాం. ప్రతి ఇంట్లో జరుపుకునే ఈ పండుగలో టపాసులదే అగ్ర స్థానం. కాబట్టి అధికారులు అన్ని విధాలుగా చర్యలు తీసుకుని సరసమైన ధరలకు టపాసులు అందిస్తే మాలాంటి చిన్న, మధ్య తరగతి ప్రజలకు మేలు జరుగుతుంది.

– ఆర్.మహేష్, కపాసుకుద్ది, కవిటి మండలం

శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ ప్రతినిధులు

పాలస్తీనాపై యుద్ధం ఆపాలి

అఖిల భారత శాంతి సంఘీభావ సంస్థ డిమాండ్

ప్రజాశక్తి– శ్రీకాకుళం అర్బన్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దురాక్రమణ, యుద్ధం ఆపాలని, 1967కు ముందరి భూభాగంతో స్వతంత్ర పాలస్తీనా దేశం ఏర్పరచాలని విశాఖ పోర్టు ట్రస్టు ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు జె.వి.సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. నగరంలోని క్రాంతి భవనంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం ఆధ్వర్యాన కన్వీనర్ బి.కృష్ణమూర్తి అధ్యక్షత శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అమెరికా ఆర్థిక భవితవ్యం అంతా యూదుల చేతుల్లోనే ఉందన్నారు. ఆ కారణంగా వారికి అమెరికా అండదండలందిస్తోందని తెలిపారు. ఇజ్రాయెల్ చేస్తున్న దురాగతాలను బయటకురానికుండా మీడియాను నియంత్రిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. నెతన్యాహు ప్రభుత్వంపై ప్రజల వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి ఇటువంటి చర్యలు చేశట్టిందని విమర్శించారు. ఇజ్రాయెల్ ప్రయివేట్ సైన్యాన్ని ఏర్పాటు చేసుకుని దాడులకు తెగబడుతోందని దుయ్యబట్టారు. 40 రోజులుగా ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండ వల్ల పది వేలు మందికి పైగా పాలస్తీనా పిల్లలు, మహిళలు మృత్యువాత పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికా బాటలోనే మన దేశం కూడా ఇజ్రాయిల్ దురాగతాలకు వత్తాసు పలకడం శోచనీయమన్నారు. ఈ సదస్సులో సాహితీ స్రవంతి కన్వీనర్ కె.శ్రీనివాసు మాటాడుతూ ఇజ్రాయెల్‌కి అమెరికా ఆయుధాలు సరఫరా చేస్తూ యుద్ధానికి ప్రత్యక్షంగా సహకరిస్తోందని విమర్శించారు. ఇజ్రాయెల్ యూదు దురంహంకారాన్ని పెంచిపోషిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అరబ్ దేశాల్లో అమెరికా ఆదిపత్యం కోసం ఇజ్రాయెల్ పాటుపడుతోందని దుయ్యబట్టారు. అమెరికా ఆయుధాలు అమ్ముకోవడం కోసం కృత్రిమ యుద్ధాలను సృష్టిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాలస్తీనీయులకు ఆహారం, తాగునీరు మందుల సరఫరాకు ఇజ్రాయిల్ అడ్డుకోరాదని కోరారు. 75 ఏళ్లుగా పాలస్తీనా భూభాగాన్ని 75 శాతం ఇజ్రాయెల్ ఆక్రమించి వారికి నిలువ నీడలేకుండా చేసిందన్నారు. ఐక్యరాజ్య సమితి చేసిన 800 తీర్మానాలనూ ఇజ్రాయెల్ తుంగలో తొక్కిందన్నారు. పాలస్తీనాకు సంఘీభావంగా నిలిచే భారత దేశ విధానాన్ని మోడీ ప్రభుత్వం పూర్తిగా తిరగదోడిందని విమర్శించారు. పాలస్తీనా ప్రజలకు భారత ప్రభుత్వం ప్రజలు ఈ ఆపత్కాలంలో అండగా నిలవాలన్నారు. పాలస్తీనా ప్రజలు ఆకలితో అలమటిస్తున్నా వారిపై దాడులు ఆపడంలేదని దుయ్యబట్టారు. ఆస్పత్రులపై దాడులు చేస్తూ అక్కడి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం క్రాంతి భవన్ నుంచి సూర్యమహల్ వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు పి.తేజేశ్వరరావు, సానూ, షేక్ జిలానీ, అనపాన. షణ్ముఖరావు, డి.పార్వతీశం, సిహెచ్.వెంకటరమణ, ఎం.ఆదినారాయణమూర్తి, ఎం.గోపి, పి.సుధాకరరావు, కృష్ణ, చిన్నమ్మడు పాల్గొన్నారు.

కిడ్నీ పరిశోధనా కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి– పలాస

పలాస– కాశీబుగ్గ మున్సిపాలిటీ పద్మనాభపురం సమీపంలో రూ.50 కోట్లతో నిర్మించిన 200 పడకల ఆస్పత్రితో పాటు కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని పశు సంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు వైద్యులతో కలసి శనివారంపరిశీలించారు. మంత్రిని ఆస్పత్రిలోని ప్రతి విభాగాన్నీ వైద్యులకు చూపించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా జగన్మోహనరెడ్డి ఉద్దాన కిడ్నీ రోగులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం ఏర్పడిన వెంటనే నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కరోనా సమయంలో రెండేళ్ల పనులు నిలిచిపోయినా, ఆస్పత్రి పూర్తి చేసేందుకు అనేక ఇబ్బందులు వచ్చినా వాటిని ఎదుర్కొన్నానని పేర్కొన్నారు. అనేక బాలరిష్టాలు అధిగమించి ఈ నెల 23న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు సన్నహాలు చేస్తున్నానని తెలిపారు. జిల్లాలో వన్నె తెచ్చే విధంగా కిడ్నీ ఆస్పత్రి సేవలు రోగులకు ఉంటాయని అన్నారు. ఈయన వెంట పలాస–కాశీబుగ్గలకు చెందిన వైద్యులు మల్లేశ్వరరావు, రాజకుమార్, భీమారావు, బాలకృష్ణ, పొందల జగదీష్, కృష్ణమూర్తి, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, జిల్లా వైసిపి ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, పలాస కాశీబుగ్గ మున్సిపల్ మాజీ చైర్మన్ కోత పూర్ణచంద్రరావు, పలాస ప్రభుత్వాస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ డబ్బీరు భవానీశంకర్, వైసిపి నాయకులు అంబటి ఆనందరావు, లక్ష్మణ్, రోణంకి శ్రీనివాసరావు, హనుమంతు రామ్మోహనదొర, అల్లు వెంకటరమణ, కొర్రాయి శ్రీకాంత్, కృష్ణలు పాల్గొన్నారు.

వైద్యులతో మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు

మణి మోహన్ (ఫైల్)

పిక్నిక్ సరదా ఓ విద్యార్థి ప్రాణాన్ని బలితీసుకుంది. దీంతో ఆ తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. దీపావళి వెలుగులు చూడకుండా పోయారు. చెట్టంత కొడుకు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. వారిని ఓదార్చడం ఎవరి తరమూ కాలేదు. చేతికంది వచ్చిన మా ఆశల దీపం ఆరిపోయిందని ఆ కుటుంబం హృదయ విదారకంగా విలపిస్తుంది. వివరాల్లోకి వెళ్తే...

పండగ పూట విషాదం

- సముద్ర కెరటాల్లో చిక్కుకుని విద్యార్థి మృతి
- ఆశల దీపం ఆరిపోయిందని రోదిస్తున్న తల్లిదండ్రులు

ప్రజాశక్తి– బూర్జ

బూర్జ మండలం కొల్లివలసకు చెందిన పొట్నూరు మణి మోహన్ (మణికంఠ) (15) తోటవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. దీపావళికి మూడు రోజులు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది. దీంతో ఆ పాఠశాలలో చదువుకుంటున్న 13 మంది మిత్రులు కలిసి సరదాగా పిక్నిక్‌కు వెళ్దామని శనివారం ఉదయం 7 గంటలకే ఇంటి నుంచి బయలుదేరి వెళ్లారు. గార మండలం కళింగపట్నం సమీపంలో మొగదలపాడు సముద్ర తీరానికి చేరుకున్నారు. అక్కడ భోజనాలు చేసి సరదాగా సముద్రతీరంలో వెళ్లి స్నానం చేస్తూ.. ఉత్సాహంగా గడిపారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకున్నారు. ఇంతలో సముద్ర కెరటం ఉవ్వెత్తున రావటంతో ఆ కెరటంలో మణి మోహన్ అనే విద్యార్థి చిక్కుకున్నాడు. బయటికి రాలేని పరిస్థితి నెలకొంది. వెంటనే తోటి విద్యార్థులు కేకలు వేస్తూ భయాందోళనకు గురయ్యారు. అందుబాటులో ఉన్న ఈతగాళ్లు, జాలర్లు పరిగెత్తుకొని వచ్చి బోట్లు వేసుకుని వెళ్లి ఆ విద్యార్థిని గాలించి బయటకు తీసుకువచ్చారు. అయినా వాళ్ల శ్రమ ఫలించలేదు. వెంటనే జిల్లా సర్వజానస్పత్రికి తరలిస్తుండగా... మార్గమధ్యంలో ఆ విద్యార్థి మృతి చెందాడు. దీంతో తోటి విద్యార్థులు నిర్ఘాంతపోయారు. ఏం చేయాలో తోచక... వాళ్ల నోటి మాటరాక మూగపోయారు. ఎలాగోలా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కొల్లివలసలోని చెందిన కుటుంబ సభ్యులు, బంధువులు మిత్రులు స్థానికులు సముద్రతీరానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు. పోస్టుమార్టం కోసం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ఎన్నికల ధ్యాసే తప్ప ప్రజా దృష్టి ఏదీ?



ప్రజాశక్తి– శ్రీకాకుళం ప్రతినిధి

వైసిపి రకారకాల కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లేందుకు చేస్తున్న ప్రయత్నాలు పెద్దగా ఫలితమిస్తున్నట్లు కనిపించడం లేదు. గడప గడపకూ మన ప్రభుత్వం ఒక వైపు సాగుతుండగా... మరోవైపు సామాజిక సాధికార బస్సు యాత్రలను ప్రారంభించింది. ఇది చాలదన్నట్లుగా తాజాగా వై ఎపి నీడ్స్ జగన్ అనే పేరుతో నాయకులకు మరో పరీక్ష పెట్టింది. ప్రతి మండలంలోని రోజుకొక సచివాలయం పరిధిలో ప్రతి ఇంటికీ, ప్రతి పౌరుడికీ ప్రత్యక్షంగా, పరోక్షంగా చేకూర్చిన మేలును ప్రజలకు వివరించడం ద్వారా ప్రచారం పొందాలని భావించింది. ప్రభుత్వం, పార్టీ అంచనాలకనుగుణంగా జనం నుంచి పెద్దగా స్పందన కనిపించడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలనే ఏకరువు పెడుతుండటంతో జనం పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇప్పటికే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న ప్రభుత్వం సంక్షేమ పథకాలతో రూపొందించిన కరపత్రాలకు ఇప్పటికే అందిస్తున్నారు. వై ఎపి నీడ్స్ జగన్ కార్యక్రమంలోనూ అవే అంశాలతో ప్రచారం చేస్తుండటంతో జనానికి బోరు కొడుతోంది. అటు ప్రజా ప్రతినిధులు, నాయకుల్లోనూ పెద్ద ఉత్సాహం కనిపించడం లేదు. సచివాలయాల్లో జెండా ఎగురవేయడం, ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను వివరించడం, వారితో కలిసి భోజనం చేయడం, పల్లెనిద్ర వంటి కార్యక్రమాలు చేయాల్సి ఉన్నా... కేవలం జెండా ఎగురవేయడం, ప్రసం గాలతో ముగిస్తున్నారు. జనాలు లేక చాలాచోట్ల వెలవెల బోతున్నాయి. సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, పార్టీ సానుభూతిపరులే ఎక్కువగా కనిపిస్తున్నారు. అటు ప్రజా ప్రతినిధులు, మండల, గ్రామస్థాయి నాయకుల్లోనూ నిరాసక్తత కనిపిస్తోంది. పార్టీ రూపొందిస్తున్న రకరకాల కార్యక్రమాలతో అత్యధిక మంది విసుక్కుంటున్నారు. దీంతో పాటు కార్యక్రమం నిర్వహణకు చేతి చమురు వదులుతుండటంతో అంతర్గతంగా మదనపడుతున్నారు. మరోవైపు సామాజిక సాధికారయాత్ర పేరుతో ఇప్పటికే బస్సు యాత్రలు చేస్తున్నారు. నియోజకవర్గ కేంద్రాల్లో సభలు నిర్వహిస్తున్నారు. సభలకు జనాలను తరలించడానికి నానాపాట్లు పడుతున్నారు. అన్నిచోట్లా డ్వాక్రా సంఘాల మహిళలనే తరలిస్తున్నారు. వారూ సభ జరుగుతుండగానే మధ్యలోనే నిష్క్రమిస్తున్నారు. జనం హాజరు ఎలా ఉన్నా నేతలు మాత్రం పార్టీ ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారు.

టిడిపి అధినేత చంద్రబాబు జైల్లో ఉన్నంత వరకు పలు రకాల నిరసన కార్యక్రమాలతో హోరెత్తించిన ఆ పార్టీ ఇప్పుడు మళ్లీ ప్రచార కార్యక్రమాలపై దృష్టి సారించింది. బాబు ష్యూరిటీ.. భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంతో పార్టీ నాయకులు, శ్రేణులు గ్రామాల్లో ప్రచారం మొదలు పెట్టాయి. ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని జనంలోకి వెళ్లేందుకు వైసిపి, టిడిపి ప్రయత్నిస్తున్నాయి తప్ప ప్రజా సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రచార కార్యక్రమాలను పోటాపోటీగా నిర్వహిస్తున్నా.. ప్రజా సమస్యలను తెలుసుకునే ప్రయత్నం ఏ ఒక్కరూ చేయడం లేదు. అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం తప్ప... ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వారి సమస్యలపై ప్రత్యక్షంగా పోరాటం చేసేందేమీ ఉండదని జనమెరిగిన సత్యం. జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా తీవ్ర కరువు పరిస్థితులను చవిచూస్తున్నారు. జిల్లాలో 2023 ఖరీఫ్‌లో 4,37,153 ఎకరాల్లో అన్ని రకాల పంటలను వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, వర్షాభావ పరిస్థితుల వల్ల 3,81,833 ఎకరాల్లోనే పంటలు వేయగలిగారు. వరి పంటను 3,98,750 ఎకరాల్లో వేయాల్సి ఉండగా, 3,53,325 ఎకరాల్లోనే వేయగలిగారు. వర్షాలు పడక సాగు చేసిన పంటలూ ఎండిపోతున్న పరిస్థితి నెలకొంది. అధికారిక లెక్కల ప్రకారం నెల రోజులకు పైగా వర్షాలు లేకపోవడంతో జిల్లాలో 15 మండలాల్లో 20,938 ఎకరాల్లో వరిపంట ఎండిపోయింది. వంశధార, నాగావళి నదులు ఎండిపోయాయి. సాధారణంగా అక్టోబరు నెలలో వంశధారలో 2 వేల నుంచి 3 వేల క్యూసెక్కుల నీరు ప్రవహించే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం 1200 క్యూసెక్కులకు పడిపోయింది. నాగావళిలో ఇన్‌ఫ్లో జీరో క్యూసెక్కులుగా ఉంది. పంటలు ఎండిపోకుండా ఆయకట్టు భూములకు తోటపల్లి, మడ్డువలస ద్వారా నీటిని అందిస్తున్నారు.

జిల్లాలో కరువు పరిస్థితులు తీవ్రంగా ఉన్నా... నిబంధనల పేరుతో ప్రభుత్వం జిల్లాలోని ఒక్క మండలాన్నీ కరువు ప్రాంతంగా ప్రకటించలేదు. దీనిపై టిడిపి కనీసం నోరు మెదపడం లేదు. కరువు డిమాండునూ ప్రభుత్వం ముందుంచడం లేదు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు మరో వైపు బస్సు యాత్రలు, సచివాలయాల్లో జెండాలు ఎగురవేయడంలో తీరికలేకుండా ఉన్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో కలెక్టరేట్‌లో ఈ నెల పదో తేదీన నిర్వహించిన నీటి పారుదల, వ్యవసాయ సలహా మండలి సమావేశానికి అత్యంత ప్రాధాన్యత ఉన్నా... ప్రజా ప్రతినిధులు ఒక్కరూ హాజరు కాకపోవడం విమర్శలకు తావిచ్చింది. అధికార, ప్రతిపక్ష పార్టీలు జనం సమస్యల కంటే రాబోవు ఎన్నికల్లో ఎలా గట్టెక్కాలనే అంశంపైనే దృష్టి పెట్టాయనన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నాలుగున్నరేళ్లలో ఏం చేశామో వైసిపి చెప్తుంటే, రాబోవు ఎన్నికల్లో గెలిస్తే ఏం చేస్తామో టిడిపి ప్రచారం చేసుకుంటోంది. జనం ప్రస్తుతం ఎదుర్కుంటున్న సమస్యలపై ఎవరూ మాట్లాడటం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులే నడుం బిగించి కరువుపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైంది.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT AMADALAVALASA.
IA. 202/2019 in OS 85/2006
IN AS 66/2013

Between: **Modalavalasa Kasi Viswanadham**
--Petitioner/Plaintiff
And: **Modalavalasa Jaganmohana Rao & others** --Respondents/Defendents

To, **R-2 Modalavalasa Amarendra,** S/o.Late Kurmanayakulu, aged 36 years, Hindu, Bammidivanipeta vllage, Ponnam Post, Srikakulam Mandal and District.

పిటిషనరు పై కోర్ట్ లో పై నెంబరు ఫైనల్ డిక్రీ పిటిషను దాఖలు చేసియున్నారు సదరు పిటిషనులో మీరు 1వ రెస్పాండెంట్స్/ప్రతివాది అయినందున కోర్ట్ వారు మీ యొక్క హాజరు నిమిత్తం **తే. 16-11-2023 దీ కు** శ్రీ కోర్టు వారు పై నెంబరు కేసు ను వాయిదా వేసినారు కావున పై తేది నాడు **ఉదయం 10-30 గం॥ కు** పై కోర్ట్ వారి ఎదుట మీరు స్వయం గాని వకీలు ద్వార గాని హాజరు అయి మీకు గల ఆక్షేపణలు తెలియపరచు కొనవలెను. లేని యెడల మీ పరోక్షంగా తీర్మానించడమగునని ఇందుమూలంగా తెలియపరచడమైనది.

పైడి ఆనంతరావు
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 9346034649.

IN THE HONOURABLE COURT OF THE SECOND ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
I.A.No. 145/2020 in OS 187/2020

Between:-
Pippalla Suvarna Saraswathi.
--Petitioner/Plaintiff
And:
Mamidi Ramarao
--Respondents/Defendents

To,
Mamidi Ramarao, S/o Chinnam Naidu Hindu, aged 55 years, business, residing at Kovilam village, L.N.Peta Mandalam Srikakulam district.

పై నెంబరు గల పిటీషన్‌లో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 15-11-2023న** వాయిదా యున్నది. గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

K. SANKARA RAO
Advocate,
Srikakulam,
Cell: 9491567435.

IN THE HONOURABLE COURT OF THE SECOND ADDITIONAL JUNIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
OS 187/2020

Between:-
Pippalla Suvarna Saraswathi.
--Plaintiff
And:
Mamidi Ramarao
--Defendents

To,
Mamidi Ramarao, S/o Chinnam Naidu Hindu, aged 55 years, business, residing at Kovilam village, L.N.Peta Mandalam Srikakulam district.

పై నెంబరు గల దావాలో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 15-11-2023న** వాయిదా యున్నది. గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

K. SANKARA RAO
Advocate,
Srikakulam,
Cell: 9491567435.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT PONDURU
IA.No. 293/2019 in OS.No.33/2019

Between: **Smt. Rajana Suramma**
--Petitioner/Plaintiff
And:
Sri Laveti Muralidhar And others
--Respondents/Defendents

To,
R-8 Sri Potnuru Pottodu. S/o Papalu, Hindu, Aged 30 Years, Resident of Ullivalasa Village, M. Duggivalasa Post, G. Sigadam Mandal, Srikakulam District.

పై నెంబరు గల పిటీషన్‌లో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 16-11-2023న** వాయిదా యున్నది. గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

K. AMMINAIDU
KUNA ASHOK KUMAR
Advocate,
Srikakulam, Cell: 7989705862.

IN THE HONOURABLE COURT OF THE JUNIOR CIVIL JUDGE AT PONDURU
OS.No.33/2019

Between: **Smt. Rajana Suramma**
--Petitioner/Plaintiff
And:
Sri Laveti Muralidhar And others
--Respondents/Defendents

To,
D-8 Sri Potnuru Pottodu. S/o Papalu, Hindu, Aged 30 Years, Resident of Ullivalasa Village, M. Duggivalasa Post, G. Sigadam Mandal, Srikakulam District.

పై నెంబరు గల దావాలో మీకు నోటీసులు సర్వీస్ గానందున పేపర్ పబ్లికేషన్ ద్వారా నోటీసు నిమిత్తం **తేది 16-11-2023న** వాయిదా యున్నది. గనుక సదరు వాయిదాకు మీరు స్వయంగా గాని లేదా అడ్వకేటు ద్వారా గాని కోర్టుకు పై **తేదిన ఉదయం 10.30 గం॥లకు** హాజరై మీకు గల ఆక్షేపణలు తెలియ పరుచు కొనవలెను. లేనియెడల మీపరోక్షమున విచారించి తీర్మానించడమగునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

K. AMMINAIDU
KUNA ASHOK KUMAR
Advocate,
Srikakulam, Cell: 7989705862.

వినతిపత్రం అందజేస్తున్న ఎపి ఉపాధ్యాయ సంఘ సభ్యులు

జిపిఎస్ రద్దు చేయాల్సిందే

ప్రజాశక్తి- కవిటి

ఇటీవల కాలంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలు పరిష్కారమయ్యేలా సహకరిస్తు, ప్రభుత్వం చెబుతున్న జిపిఎస్ రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం అశోక్‌ను ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం సభ్యులు కీలు సోమేశ్వరరావు, బండారు శంకరం కోరారు. శనివారం కవిటి మండలం రామయ్యపుట్టుగలో ఎమ్మెల్యేను కలిసిన సంఘ సభ్యులు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిపిఎస్ జిఒ 116ను ఉపసంహరించుకుని, సిఎం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల సౌలభ్యం దృష్టిలో ఉంచుకుని జిఒ నెం 117 రద్దు చేయాలని కోరారు. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షన్‌దారుల పిఎఫ్, ఎపిజిఎల్ఐ, సంపాధిత సెలవులు, ఇతర ఆర్థిక బకాయిలు సెప్టెంబర్ 30లోగా పూర్తిగా చెల్లిస్తామని, పిఆర్‌సి, డిఎ బకాయిలు అక్టోబర్ 31లోగా ఇస్తామని చెప్పినా ఇంతవరకు ఎటువంటి పురోగతి లేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తమకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆనింగి నాగేశ్వరరావు, తారకేశ్వరరావు, మల్లేష్, సత్యానంద్, చిరంజీవి పాల్గొన్నారు.

ప్రత్యేక రైలును ప్రారంభించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమస్యలపై చర్చిస్తున్న ఎంపీ

ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజలకు అత్యవసరంగా శబరమలై యాత్రకు ప్రత్యేక రైలు ఏర్పాటు చేయాలని ఎంపీ రామ్మోహన్ నాయుడు కోరారు. రైల్వే వాల్తేర్ డిఆర్ఎం సౌరబ్ ప్రసాద్‌ను శనివారం భేటీ అయ్యారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన వేలాది మంది యాత్రికులు ఈ ప్రాంతం నుంచి అత్యధికంగా కేరళ వరకు యాత్రికులు వెళ్లేందుకు ఇబ్బందులు పడతున్నారని అన్నారు. పెరిగిన రద్దీ దృష్ట్యా సరిపడా రైళ్ల లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఈ నెల 15 నుంచి మకర సంక్రాంతి వరకు శబరిమలైకు ప్రత్యేక రైళ్లు నడపాలని కోరారు ఇటీవల ప్రకటించిన విశాఖపట్నం-వారణాసి ప్రత్యేక రైలును త్వరగా ప్రారంభించాలని, అలాగే కాశీ అన్నపూర్ణ ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేయాలని అన్నారు. విశాఖ-పలాస రైలును ఇచ్ఛాపురం వరకు పొడిగించాలని కోరారు. భువనేశ్వర్-పలాస రైలును శ్రీకాకుళం రోడ్డు వరకు నడపాలన్నారు. రెండు ప్రాంతాల మధ్య రోజూ వందలాది మంది ఉద్యోగులు, వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారని అన్నారు. వారికి ఈ రైలు ఎంతో ప్రయోజనకరం ఉంటుందని తెలిపారు. అలాగే విశాఖ-రాయపూర్ పాసింజర్ రైలును గతంలో తరహాలో వేకువజాము 4.30 గంటలకే నడిచేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దీనితో పాటు హరిశ్చంద్రపురం రైల్వే స్టేషన్‌లో వివిధ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలుపుదల చేయాలన్నారు. అఆగే కామేశ్వరిపేటలో హాల్ట్ పునరుద్ధరించాలని కోరారు. ప్రతిపాదనలను పరిశీలించిన డిఆర్ఎం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

రోగులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఎంపిపి డాక్టర్ దాసు

వైద్య శిబిరానికి స్పందన

సోంపేట: స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహంలో జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని ఎంపిపి డాక్టర్ ఎం.దాసు అన్నారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎంపిపి దాసు రోగులను పరీక్షించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. పేదప్రజల కోసం ఉచితమెడికల్ క్యాంపులు నిర్వహించడం, జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలు ఉచితంగా వైద్యపరీక్షలు చేయించుకుంటే అవసరమైన మందులు ఇవ్వడం జరిగిందన్నారు. అనంతరం వసతి గృహంలో విద్యార్థులతో మాట్లాడి వసతి, భోజనాలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ నగిరి ప్రభావతి, వార్డు మెంబర్లు మల్లా వెంకట రమణ, తోట ఢిల్లీ, పచ్చిళ్ల గిరి, పొందర లోకనాథం, తంగుడు సురేష్, డాక్టర్ వింగ్ సెక్రటరీ తేజ పట్నాయక్, జెమ్స్ ఆస్పత్రి వైద్య బృందం, జక్కం రమేష్, సల్ల రమేష్ పాల్గొన్నారు.

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న సినీ నటులు

కొత్తమ్మతల్లి సన్నిధిలో సినీ బృందం

కోటబొమ్మాళి : కోటబొమ్మాళిలో కొత్తమ్మతల్లిని కొత్తగా నిర్మాణం చేపడుతున్న కోటబొమ్మాళి సిఎస్ సినీ బృందం శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ బృందంలో హీరో రాహుల్ విజయ్, హీరోయిన్ శివాని, నటులు తేజోమాళిని, వాణి, వజ్రపుకొత్తూరు మండలం పొట్టాడ గ్రామానికి చెందిన జామి శ్రీనివాస్, నిర్మాత రత్నాజీ, సహ నిర్మాత బాలలు ఉన్నారు. వీరిని ఆలయ పురోహితులు సుసరావు జనార్ధనశర్మ పూర్ణకుంభంతో, స్థానిక టిడిపి అధ్యక్షుడు బోయిన రమేష్, ఆలయ కమిటీసభ్యులు బోయిన మాధవి కృష్ణారావు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ స్వాగతం పలికారు. అనంతరం సినిమాలో రెండో పాటను అలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. సత్యశ్రీనివాస్, బోయిన రుత్విక్, తంగుడు సునీల్, గోవిందరావు, కసర ప్రసాద్ పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కాకినాడ ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సహకారంతో నాంది ఫౌండేషన్ నిర్వహించిన ఉపాధి నైపుణ్య శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. ఈ శిక్షణలో భాగంగా నాంది ఫౌండేషన్ శిక్షకులు ప్రస్తుత రోజుల్లో విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడే కమ్యూనికేషన్ స్కిల్స్, సాఫ్ట్ స్కిల్స్, బృంద చర్చ పైన అవగాహనలను, పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, ఇంటర్వ్యూకు సంబంధించిన మెలకువలను నేర్పించి వాటిపైన విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ కె.శివశంకర్, డైరెక్టర్ బి.ఎస్.చక్రవర్తి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థులకు ఉపయోగపడే ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు మన కాలేజీలో నిర్వహించడం ఆనందాయకమన్నారు. కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ జోనల్ హెడ్ శ్రీలక్ష్మి, నాంది శిక్షకులు, కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ అధికారి ఎల్.ప్రసాదరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శివశంకర్

ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి

కవిటి : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి: కూల్చివేతలతో ప్రారంభమైన వైసిపి ప్రభుత్వం కూలిపోయే సమయం ఆసన్నమైందని ఎమ్మెల్యే బెందాలం అశోక్ జోస్యం చెప్పారు. మండలం బిజి పుట్టుగ గ్రామంలో శనివారం బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నియంతృత్వ పోకడలతో సాగుతున్న ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేసిందని విమర్శించారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజలకు రూ.100 చేతిలో పెట్టి ట్రు అప్ చార్జీల పేరుతో నెలకు రూ.500 దోచుకుంటోందని ఎద్దేవా చేశారు. అనంతరం గ్రామంలో కలియ తిరుగుతూ రైతాంగ, మధ్యతరగతి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయబోయే పథకాలు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పొందల కృష్ణారావు, బెందాలం రమేష్, మణి చంద్ర ప్రకాష్, సంతోష్ పట్నాయక్, బాసుదేవ్ రౌలో, బార్ల చినబాబు, శమళ్ల సర్వేసం, పూడి రామారావు పాల్గొన్నారు.

లావేరు: మాజీ నారాచంద్రబాబునాయుడు తోనే ప్రజలు భవిష్యత్ కు గ్యారంటీ ఉంటుందని లావేరు మండల టీడీపీ క్లస్టర్ ఇంచార్జి గొర్లె శ్రీనువాసురావు అన్నారు శనివారం తామాడ పంచాయతీ కొత్తరౌతుపేటలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి గొర్లె శ్రీనువాసరావు పాల్గొని ఇంటింటా టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి మజ్జి రామమూర్తి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మేజరు పంచాయతీ నాయీబ్రాహ్మణుల వీధిలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ బాండ్లను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర బిసి సాధికారిత కార్యదర్శి బోయిన గోవిందరాజు, టిడిపి నాయకులు నౌగాపు నాగరాజు, కమ్మకట్టు అప్పలరాజురెడ్డి, కోరాడ గోవింద, సకాలభక్తుల రాంకుమార్, కోరాడ చిన్న గోవింద, అను పాల్గొన్నారు. అలాగే మండలం హరిశ్చంద్రపురం పంచాయతీలో మాజీ ఎంపిటిసి హనుమంతు అప్పలరాజు, చీపుర్లపాడు పంచాయతీ ఊడికలపాడులో మాజీ సర్పంచ్ గొండు లక్ష్మణరావు ఆధ్వర్యంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు.

కోటబొమ్మాళి : పత్రాలను అందజేస్తున్న గోవిందరాజులు

'చలో విజయవాడ' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- రణస్థలం

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవంబరు 15న చలో విజయవాడను జయప్రదం చేయాలని సిపిఎం నాయకులు వెలమల రమణ, సిహెచ్ అమ్మన్నా యుడు పిలుపునిచ్చారు. సిపిఎం ప్రజా రక్షణ భేరి ఛలో విజయవాడ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లౌకికవాదం, ప్రజాస్వామ్య పరిరక్షణ, అసమానతలు లేని అభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న సభకు అత్యధిక ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలన్నారు. బిజెపి ప్రభుత్వం కార్పొరేట్‌లకు రాయితీలు ఇస్తూ ప్రభుత్వ రంగాన్ని తెగనమ్ముతూ, ప్రజల ఆస్తుల్ని అంబానీ, అదానీలకు దోచిపెడు తోందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ, ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ఉద్యోగాలు భర్తీ, మూతపడిన పరిశ్రమలు తెరిపించడం, ధరలు అదుపుచేయడం, రైల్వేజోన్, విభజన హామీలు అమలు వంటి వాటితో కూడిన ప్రజాప్రణాళిక సిపిఎం ప్రజల ముందుంచు తుందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు. **ఫోటో:**

కొత్తూరు: మండలంలో గొట్టిపల్లి వారపుసంతలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రజారక్షణ భేరి విజయవంతం చేయాలని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ నెల 15న ఛలో విజయవాడలో జరుగు బహిరంగ సభకు ప్రజలు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలు ప్రజలకు వివరించడానికి చేపట్టిన బస్సుయాత్ర విజయవంతం చేయాలన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఎం అగ్రనేతలు సీతారాం ఏచూరి, బి.వి.రాఘవులు హాజరుకానున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు నిమ్మక అప్పన్న, జమ్మమ్మ, గోపాల్, గణపతి, రాము, కృష్ణ పాల్గొన్నారు.

ఐద్వా నాయకుల పరామర్శ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

పరామర్శిస్తున్న ఐద్వా నాయకులు

జిల్లాలోని ఆమదాలవలస మండలం అక్కులపేటలో కుటుంబ కలహాలతో తల్లి, కుమార్తెలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం విదితమే. అందులో తల్లి సుజాత మృతి చెందగా, ఇద్దరు కుమార్తులు మౌనిక, మేఘనలు జిల్లా సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం జిల్లా కమిటీ కన్వీనర్ అల్లాడ లక్ష్మి, అంగన్వాడీ వర్కర్సు అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకులు పంచాది లతలు శనివారం పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అక్కడున్న సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ వరకట్న దురాగతంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన పాలకులు చోద్యం చూస్తున్నారని అన్నారు. అందువల్లే నానాటికీ వరకట్న వేధింపులు తీవ్రమవుతున్నాయని అన్నారు. సుజాత మృతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తల్లి మృతి చెందగా, తండ్రి జైలు పాలవడంతో పిల్లలిద్దరూ దిక్కుతోచని స్థితిలో ఉన్నారని, వారిని ప్రభుత్వమే ఆదుకొని మెరుగైన వైద్య సదుపాయాన్ని అందించాలన్నారు. కోలుకున్న తరువాత చిన్నారులకు ఉన్నత విద్యను అందించాలని డిమాండ్ చేశారు.

కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమించాలి

మాట్లాడుతున్న గనిరాజు

టెక్కలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆనుసరిస్తున్న విద్యా కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యోగ, ఉపాధి హక్కుల కోసం ఉద్యమించాలని పిడిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షులు యు.గనిరాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. స్థానిక ఉన్నత పాఠశాల మైదానంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.వినోద్‌కుమార్ అధ్యక్షతన ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పిడిఎస్‌యు) జిల్లా 12వ మహాసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ నూతన విద్యా విధానం వల్ల విద్యారంగాన్ని కార్పొరేటీకరణ చేయడంతో పాటు రాష్ట్రాల ఫెడరల్ హక్కులను కాలరాస్తుందని అన్నారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ దూరం చేసి జారీ చేసిన జిఒ 77ను రద్దు చేయాలన్నారు. విశాఖ ఉక్కు పోరాటానికి, కార్మికులకు పిడిఎస్‌యు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. ఎపిటిఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి వై.సూర్య ప్రకాశరావు మాట్లాడుతు విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం అలవడాలని సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు. డిటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు కోత ధర్మారావు మాట్లాడుతూ విద్యారంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో నిధులు శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూ డెమెక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాదవరావు, సునీల్, మహేష్, జీవన్, రాజేష్, ధర్మారావు పాల్గొన్నారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

'గుండ' దంపతులను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్ :

టిడిపికి చెందిన మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవిలను అరసవల్లిలోని వారి స్వగృహంలో జనసేన నాయకులు మర్యాదపూర్వకంగా కలసుకున్నారు. వారికి సాధరణంగా ఆహ్వానించారు. టిడిపితో కలసి పనిచేసేందుకు పార్టీ అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో నియోజక వర్గస్థాయిలో కలవడం ఇదే ప్రథమం. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఎస్‌సి సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ మాదిగ, నియోజకవర్గం జనసేన నాయకులు కొండా ఉదయ్ శంకర్, గురు ప్రసాద్ గౌడ్, రూరల్ మండల అధ్యక్షుడు కూర్మారావు, కామేష్, జిల్లా సోషల్ మీడియా మెండ గిరీష్ ప్రతాప్ పాల్గొన్నారు.

ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు

శాసనసభ స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

నియోజకవర్గ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ధ్యేయమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని పెనుబర్తి, అలమాజీపేట, ఖాజీపేట గ్రామాల్లో జలజీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటా కుళాయిల ఏర్పాటుకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో ఎక్కడా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం మహాయజ్ఞంలా చేపట్టామన్నారు. నియోజకవర్గంలో పలుచోట్ల ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని అన్నారు. మరికొన్ని చోట్ల పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. యుద్ధప్రాతిపతికన పనులు చేపట్టి ప్రజల ముంగిటకు తాగునీరు అందించాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగ క్షేమాలను, సమస్యలను తెలుకుని తక్షణ పరిష్కారం చేపట్టేందుకు వీలుగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినేని యూన్నీ, ఉప సర్పంచ్ పొన్నాడ సత్యం, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, వైసిపి మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, స్థానిక నాయకులు తమ్మినేని మురళి, చింతాడ సత్యప్రసాద్, బొడ్డేపల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

బూర్జ: మండలం కాఖండ్యాంలో శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ముద్రించి పోస్టర్లను అందజేశారు. ఇందులో భాగంగా సమస్యను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి కర్నెన నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, వైసిపి మండల అధ్యక్షులు ఖండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, డిసిఎంఎస్ డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షులు సురపు ఉదయ్,సర్పంచ్‌లు కె.రామకృష్ణ, కె.గోవిందరావు పాల్గొన్నారు.

పొందూరు : శంకుస్థాపన చేస్తున్న స్పీకర్ సీతారాం

అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి- పోలాకి

దీపావళి సందర్భంగా ప్రభుత్వ అనుమతులు లేకుండా మందుగుండు సామగ్రి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని తహశీల్దార్ కె.శ్రీరాములు అన్నారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో ఈ ఏడాది నాలుగు షాపులకు అనుమతులు వచ్చాయని తెలిపారు. పిన్నింటి పేటలో రెండు, పోలాకి కేంద్రంలో ఒకటి, ఈదులవలస కూడలి వద్ద ఒకటి లైసెన్స్‌లు మంజూరు అయ్యాయని తెలిపారు. లైసెన్స్ షాపుల యజమానులు కొనుగోలుదారులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే షాపులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ రెండు రోజులు గ్రామ రెవెన్యూ అధికారులు, మండల రెవెన్యూ పరిశీలకులు గ్రామంలో పరిశీలించడం జరుగుతుందన్నారు. ఈయనతో పాటు డిటి శ్రీనివాసరావు ఉన్నారు.

బూర్జ: దీపావళి సందర్భంగా మందుగుండ సామాగ్రీని ఎవరైనా అనుమతులు లేకుండా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ అశోక్‌బాబు అన్నారు. శనివారం విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు మేరకే బాణసంచా విక్రయాలు జరపాలని, అక్రమ నిల్వలు చేయరాదని, దుకాణాల వద్ద బాణసంచా కలిగి ఉంటే చర్యలు కఠినంగా ఉంటాయని హెచ్చరించారు.

1న పెన్షన్ చెల్లించాలి

ఆమదాలవలస :ప్రతినెల 1వ తేదీనే ప్రభుత్వ సర్వీస్ పెన్షనర్లందరికీ విధిగా ప్రభుత్వం పెన్షన్ చెల్లించాలని పెన్షనర్ల సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శనివారం పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో జరిగిన పెన్షనర్ల సంఘ కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలను ఆమోదించారు. పెన్షనర్లకు 2018 నుంచి బకాయి పడిన కరువు భత్యం, పిఆర్‌సి బకాయిలు సంక్రాంతి పండుగలోగా చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మి నాయుడు, బొడ్డేపల్లి జనార్ధనరావు, హెచ్‌వి సత్యనారాయణ, బొడ్డేపల్లి మోహనరావు, కె.సంజీవరావు, దన్నాన శ్రీరామ్మూర్తి, బెండి గోపి, ఎస్.వాసుదేవరావు, రమణ, కృష్ణమోహన్, నూక సూర్యనారాయణ, సూర్యనారాయణ, బి.సత్యనారాయణ పి.బానోజీరావు, దాస్యం లక్ష్మణరావు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

మాట్లాడుతున్న గీతారాణి

కొత్తూరు : ఐసిడిఎస్.ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పిఒ విమలకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10 నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు ఐసిడిఎస్ కార్యాలయానికి అందజేయాలని ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలో హంస అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడీ సహాయకుని పోస్టుకు ఒసి కేటగిరి, మాకవరంలో సహాయకుని పోస్టుకు ఎస్‌టి, నేరడి కార్యకర్త పోస్టు ఎస్‌టి, గేసరిగూడ మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టు బిసిడి, హిరమండలం మండలం కొండరాగోలు కార్యకర్త పోస్టు బిసిఎ కు, అంబావిల్లి కార్యకర్త పోస్టు ఎస్‌సి, ఎల్ఎన్‌పేట మండలం బొట్టడసింగి అంగన్వాడీ సహాయ కార్యకర్త పోస్టు ఒసికి కేటాయించినట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం ప్రాజెక్టు కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

బూర్జ: మండలంలో వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి గీతారాణి తెలిపారు. స్థానికంగా నివాసం ఉండి వివాహమైన మహిళకు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హత ఉందని తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత చెంది 21 నుంచి 35 సంవత్సరాలలోపు వయస్సు ఉన్న వారు ఈనెల 17వ తేదీలోగా కార్యాలయానికి లేదా పోస్టల్ ద్వారా దరఖాస్తు అందించాలని ఆమె కోరారు. అన్నంపేట సహాయకురాలు పోస్ట్ కోసం జనరల్ కేటగిరి (ఒసి), మామిడివలస (ఎస్‌సి) కేటగిరికి చెందినవారై ఉండాలన్నారు.

పలువురికి పరామర్శ

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో మెళియాపుట్టి, నందవ, జాడుపల్లి గ్రామాల్లో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ శనివారం పర్యటించారు. నందవ గ్రామానికి చెందిన వైస్ ఎంపిపి ఎస్. ఆదినాయుడు నాన్నమ్మ సీతమ్మ ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. మెళియాపుట్టి గ్రామానికి చెందిన కాళ్ల రామ్మూర్తి తల్లి అంకమ్మ మరణించడంతో ఆ కుటుంబాన్ని, జాడుపల్లి గ్రామానికి చెందిన ఇప్పై రాము ఇటీవల మృతి చెందడంతో రాము కుటుంబాన్ని పరామర్శించారు. ఈయనతో పాటు వైస్ ఎంపిపి ఆదినాయుడు, వైస్ ఎంపిపి ప్రతినిధి పాడి అప్పారావు, మాజీ ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్ రెడ్డి, సర్పంచ్‌లు పెద్దింటి చంద్రరావు, సిద్దిపాలెం గౌరీస్, గణపతి ప్రధాన్, బోసి రామారావు, కన్నబాబు, చాపర నారాయణరావు, సోమేశ్వరరావు, ఎస్.అన్నయ్య, ఎస్.లచ్చయ్య, నక్క వెంకటరావు ఉన్నారు.

సంతబొమ్మాళి : పాలతలగాం పంచాయతీ సర్పంచ్ నకిట్ల అప్పన్న కుమారుడు, వైసిపి నాయకులు నక్కిట్ల నరేష్‌కు బైక్ ప్రమాదం జరిగి గాయాలవ్వడంతో శనివారం రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఈయనతో పాటు వైసిపి నాయకులు సంపతిరావు రాజు, పేడాడ వెంకటరావు, అట్టాడ అప్పల నాయుడు, దుక్క భూషణ్ రెడ్డి, బొల్లా మోహన్ ఉన్నారు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ఎచ్చెర్ల: మండలం ధర్మవరం శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నవంబర్ 14 నుండి 20 వరకు జరుగుతాయని గ్రంథాలయాధికారి మలిపెద్ది చంద్రశేఖర్ తెలిపారు. నవంబర్ 14 నుండి 20 వరకు జరిగే కార్యక్రమాలకు గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువజన సంఘ సభ్యులు, మహిళా సంఘ సభ్యులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పాఠశాలల విద్యార్థులు ఆటల పోటీలు, వ్యాసరచన పోటీలు, క్విజ్, పాటల పోటీల్లో ఉత్సాహవంతులుగా పాల్గొనాలన్నారు.

టెక్కలి రూరల్: మండలం టెక్కలి శంబానవీధి శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20 వరకు 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రంథాలయాధికారి రూపావతి ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, ఆటలు, పాటలు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలో వసప గ్రామం వద్ద వంశధార నదిలో గుర్తు తెలియని మృతదేహం నది మధ్యలో తేలి ఉండడంతో స్నానానికి వెళ్లిన స్థానికులు చూసి గ్రామ వాలంటీర్‌కు తెలియజేయగా ఆ విషయాన్ని విఆర్ఒ గిరీష్ కుమార్ పట్నాయక్‌కు సమాచారం ఇవ్వగా విఆర్ఒ పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఎం.ఎ. అహమ్మద్ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 50 సంవత్సరాలు ఉంటుందని, ఎడమ చేయిపై పువ్వు గుర్తు, ప్లస్ గుర్తు, ఇంగ్లీష్‌లో సభ లతిక అనే పేరుతో పచ్చ బొట్టు ఉందని, నీలంరంగు ఫుల్ హాండ్స్ షర్ట్, నీలంరంగు లుంగీ ధరించి ఉన్నట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం సర్వజన ఆస్పత్రికి తరలించారు. విఆర్ఒ గిరీష్‌కుమార్ పట్నాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి- లావేరు

మండలం పెద్దకొత్తపల్లి పంచాయతీ కాలింగపేట, కొత్తపేట గ్రామాల సమీపంలో ఉన్న తోటలో అనధికారికంగా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై సమాచారం మేరకు శనివారం సాయంత్రం లావేరు పోలీసులు దాడులు నిర్వహించారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట, శ్రీకాకుళం పట్టణానికి చెందిన 10 మంది పేకాట ఆడుతుండగా పట్టుకున్నామని ఎస్ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. ఈ దాడిలో జూదరుల నుంచి రూ.1, 26,846 లక్షల నగదు, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని 10 మంది వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కేసునమోదు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలనాయుడు

కేలండర్ ఆవిష్కరణ

రణస్థలం : మండలంలోని ఎస్‌కె సిఎం కృష్ణచైతన్య మందిరం ట్రెస్టు ముద్రించిన 2024 కేలెండర్‌ను ఉత్తరాంధ్ర తెలుగుదేశం పార్టీ శిక్షణ శిబిరం మాజీ డైరెక్టర్, నియోజకవర్గ టిడిపి నాయకులుకలిశెట్టి అప్పలనాయుడు దంపతులు శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 19న మధ్యాహ్నం 3.30 గంటలకు నిర్వహించనున్న జగన్నాథ స్వామి రథయాత్రలో యాత్రికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కబడ్డీ పోటీల్లో రాణించిన గాయత్రి

ప్రజాశక్తి- ఆమదాలవలస

ట్రోఫీతో గాయత్రి

5వవార్డు పరిధిలో సొట్టవాని పేట ప్రాంతానికి చెందిన చల్ల గాయత్రి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో రాణించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఇటీవల ఏలూరు జిల్లా నిడదవోలు పట్టణంలో నిర్వహించిన 2023 రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జట్టుకు ప్రథమస్థానం లభించింది. శ్రీకాకుళం జట్టులో ఉన్న గాయత్రి తల్లిదండ్రులు దుర్గారావు విద్యుత్ విభాగంలో లైన్ మెన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి నాగమణి గృహిణి. రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించడం పట్ల కుటుంబ సభ్యులతో పాటు బంధువులు మున్సిపాలిటీకి చెందిన పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

చంద్రమోహన్ మృతికి సంతాపం

టెక్కలి : సినీనటుడు చంద్రమోహన్ మృతికి టెక్కలి సుదర్శన థియేటర్ యజమాని సత్తారు వెంకటరమణ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం థియేటర్ ఆవరణలో చంద్రమోహన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. పాతతరం నుంచి నేటితరం సినీ హీరోలకు, హీరోయిన్లకు చంద్రమోహన్ ఆదర్శ ప్రాయుడని అన్నారు. ఆయన మృతి కళారంగానికి తీరని లోటన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో మేనేజర్ బాలకృష్ణ, రామకృష్ణ, మహేష్ ఉన్నారు.

టిడిపి కండువాలు వేస్తున్న గోవిందరావు

టిడిపిలో పలువురి చేరిక

పాతపట్నం : ఎల్ఎన్‌పేట మండలం గొట్టిపల్లి గ్రామానికి చెందిన కత్తల శ్యాంసుందరరావు, కరువు నాయుడు, కూన రాజా, గేదెల జగన్, కాదా సాయి తరుణ్, కంబాల అప్పన్న, అంపోలు రామకృష్ణ, నక్క రవి, దారగిరి, మండేటి కృష్ణమూర్తితో పాటు 68 కుటుంబాలు టిడిపి సీనియర్ నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు ఆధ్వర్యంలో టిడిపిలో చేరారు. వారిని ఎంజిఆర్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంజిఆర్ మాట్లాడుతూ పార్టీలో చేరిన ప్రతీ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి వెలమల గోవిందరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కాగాన మన్మధరావు, టిడిపి యువ నాయకులు అంపిలి పోలినాయుడు, హిరమండలం టిడిపి మండల అధ్యక్షులు యాళ్ల నాగేశ్వరరావు, కొత్తూరు మాజీ మండల అధ్యక్షులు ఎద్దు దాసునాయుడు, నంబాల వెంకటరావు, తామర మాజీ సర్పంచ్ సిరిపురం బాబురావు, ముగుడ భద్రయ్య పాల్గొన్నారు.

రాజేష్ మృతిపై ఆందోళన

ఇచ్ఛాపురం: పట్టణంలో ప్రముఖ యువ వ్యాపారవేత్త ప్రత్తి రాజేష్ మృతిపై అనుమానాలు కలుగుతున్నాయని సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ శనివారం భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఆటో, టాక్సీ, మాక్సీ, క్యాబ్ యూనియన్ అధ్వర్యంలో కొండ శంకర్ రెడ్డి, ఉలాసి ఎర్రయ్య రెడ్డి పర్యవేక్షణలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సెప్టెంబరు 29న అనుమానాస్పద స్థితిలో ప్రత్తి రాజేష్ మృతి చెందడంపై అనేక అనుమానాలున్నాయని, ఆత్మహత్య చేసుకునే వ్యక్తిపై బలమైన గాయం ఎలా ఉందని, పోలీస్ అధికారులు మరోసారి అనుమానాలు నివృత్తి చేసేందుకు సమగ్ర విచారణ జరిపించాలని, రాజేష్ కుటుంబానికి న్యాయం చేయాలని నినాదాలు చేశారు. బస్‌స్టాండ్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో యూనియన్ సభ్యులు, రాజేష్ సోదరుడు ప్రత్తి నరేశ్ పాల్గొన్నారు.

'మౌలానా ఆజాద్' సేవలు స్ఫూర్తిదాయకం

శ్రీకాకుళం అర్బన్: పూలమాలలు వేస్తున్న డిఆర్‌ఒ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భారతరత్న, దేశ తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకమని, వాటిని ప్రతిఒక్కరూ అనుసరించాల్సిన అవసరం ఉందని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు అన్నారు. కలెక్టరేట్‌లో మౌలానా ఆజాద్ 136వ జయంతి వేడకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం మాట్లాడుతూ మౌలానా ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా, మైనారిటీ వెల్ఫేర్ దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఆయన మక్కాలో జన్మించారని, తల్లి ధనిక అరేబియా షేక్ కుమార్తె, తండ్రి ఆఫ్ఘాన్ చెందిన బెంగాలీ ముస్లిం, స్వతంత్రంతోపాటు సెక్యులరిజాన్ని నమ్మిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన రాసిన ఇండియా విన్స్ ఫ్రీడం అనే పుస్తకాన్ని ప్రతిఒక్కరూ చదవాలన్నారు. 14 ఏళ్ల పాటు జైలు శిక్ష అనుభవించిన ఆయన దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత తొలి విద్యాశాఖ మంత్రిగా నియమితులయ్యారన్నారు. సాహిత్యం, రచనలు, మేధోసంపత్తి ద్వారా దేశానికి ఎన్నో సేవలు చేశారని అన్నారు. దేశ ప్రజానీకానికి మార్గదర్శకుడిగా నిలిచిన దార్శనికుడన్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలి అని, స్వతంత్ర సమరయోధులుగా, కవిగా, రచయితగా, పాత్రికేయులుగా, విద్యావేత్తగా ఆయన సేవలందంచారని అన్నారు. కార్యక్రమంలో మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మహమ్మద్ రఫీ ,జామియా మసీద్ ప్రెసిడెంట్ మహిబుల్లా ఖాన్, క్రిస్టియన్ మైనార్టీ జీవన్, జిల్లా వర్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ జిలాఉద్దీన్, జిల్లా మైనార్టీ ప్రెసిడెంట్ ఎం.ఎ.బేక్, అబ్బు బకరా ప్రెసిడెంట్ హర్షద్, జిల్లా సెక్రెటరీ అమానుల్లా పాల్గొన్నారు.

ఎస్‌పి కార్యాలయంలో...

తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా జయంతి వేడుకలను ఎస్‌పి కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా మౌలానా చిత్రపటానికి అనదపు ఎస్‌పి జె.తిప్పేస్వామి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో దివ డిఎస్‌పి ఎస్.వాసుదేవ్, ఆర్ఐ ఉమామహేష్ పాల్గొన్నారు.

భారతీయ విద్యకు దిక్సూచి 'మౌలానా'

భారతీయ విద్యా సాంకేతిక అభివృద్ధికి భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ తొలి విద్యాశాఖ మంత్రిగా ఎనలేని కృషి చేశారని ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ వహాబ్, సెట్‌శ్రీ సిఇఒ ప్రసాదరావు, జిల్లా టూరిజం అధికారి నారాయణరావులు పేర్కొన్నారు. నగరంలోని శాంతినగర్ కాలనీలో గాంధీ మందిరం మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ జామి భీమశంకర్, నటుకుల మోహన్, నిక్కు అప్పన్న, మెట్ట అనంతంభట్లు, పందిరి అప్పారావు, బాడాన దేవభూషణ్, గుత్తు చిన్నారావు, సయ్యద్ రఫీ, తర్లాడ అప్పలనాయుడు, మాజీ సైనికుల సంఘం ప్రతినిధి పద్మావతి, ఐ.మోహనరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు మరువలేనివి

కవిటి: విద్యా రంగానికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన సేవలు మరువలేనివని బివికె పాఠశాల కరస్పాండెంట్ పూడి రామారావు, ప్రిన్సిపాల్ ఎం.అనిల్ అన్నారు. జాతీయ విద్యాదినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం పాఠశాలలో ఆజాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముందుగా మౌలాన అబుల్ కలం ఆజాద్ చిత్ర పటనికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన పాత్రపై విద్యార్థులకు తెలియజేశారు. పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలు నిర్వహించి నరకాసుర వధ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

నగదు అందిస్తున్న హెల్పింగ్ హేండ్స్ సంస్థ సభ్యులు

ఆపదలో అండగా..

ప్రజాశక్తి- కవిటి

అరుదైన వ్యాధితో బాధపడుతున్న మండలం మాణిక్యపురం గ్రామానికి చెందిన అరవ్ బిసాయ్‌కి స్థానిక అన్నవరం హెల్పింగ్ హేండ్స్ అండగా నిలిచి, అవసరమైన ఆర్థిక వనరులు సేకరిస్తోంది. ఇది వరకే తమ సంస్థ తరుపున చిన్నారికి ఆర్థిక సాయం అందించిన సంస్థ అంతటితో ఆగిపోకుండా మండలంలో వివిధ పాఠశాలలు సందర్శించి నగదు సేకరించింది. సేకరించిన రూ.35,620 అరవ్ కుటుంబ సభ్యులకు శనివారం అందించారు. అనంతరం సంస్థ సభ్యులు మాట్లాడుతూ ఆపదలో ఉన్న అరవ్ కుటుంబానికి ప్రతీఒక్కరూ అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో లలిత, సునీత, సంగీత, హరిప్రియ, రాజేష్, ప్రశాంత్, గోపి, సాగర్, సురేష్, సంతోష్, రాజు పాల్గొన్నారు.

ఊడికలపాడులో దోమ పోటుకు గురైన వరి పంట

రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

వరిసాగుకు దోమపోటు వచ్చి మండలంలో చాలా గ్రామాల్లో వరిపంట 50శాతం పాడైందని, దోమపోటుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాలకు చెందిన రైతులు కోరుతున్నారు. మండలంలో చీపుర్లపాడు, కన్నేవలస, మూలపేట, లఖందిడ్డి, బంజీరుపేట, సౌడాం, తిలారు, కొత్తపల్లి, కురుడు, ఊడికలపాడు, జీయన్నపేట, తంభయ్యపేట, హరిశ్చంద్రపురం, పొడుగుపాడు, కస్తూరిపాడు, పెద్దబమ్మిడి, చిన్న బమ్మిడి, నిమ్మాడ తదితర గ్రామాల్లో వరి సాగుకు దోమపోటు వచ్చి పొలంలో 50శాతం పంట పూర్తిగా నాశనమైందన్నారు. ఎన్ని మందులు పిచకారీ చేసిన ఫలితం లేదని, దోమపోటుతో రైతులు తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం, వ్యవసాయాధికారులు స్పందించి రైతులకు పంటనష్టం, పంటకు ఇన్సూరెన్సు అందజేయాలని రైతులు కోరారు.

కొనుగోలుదారుడు నష్టపోరాదు

పలాస : కొనుగోలుదారుడు నష్టపోకూడదనే భావనతోనే ఆశ్రా పనిచేస్తుందని జిల్లా జాయింట్ కార్యదర్శి జిఎంఎస్ అనీల్ రాజు అన్నారు. ఈనెల 24న న్యూఢిల్లీలో జరగబోయే ఆశ్రా (అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ ఎవర్నెస్)కు సంబంధించి ఆశ్రా పోస్టర్‌ను శనివారం అనీల్ రాజ్ స్థానిక పాత్రికేయులతో కలిసి ఎంపిడిఒ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివస్తువు కొనుగోలుదారు వినియోగదారుడేనని, నాసిరకం వస్తువులు, అధిక బిల్లులు ఇచ్చే వ్యాపారసంస్థలపై వినియోగదారుడు కోర్టును ఆశ్రయించవచ్చన్నారు. తమ సంస్థ ఇప్పటికే దేశవ్యాప్తంగా కేసులు వేసి విజయం సాధించిందన్నారు. విలేకరుల ప్రతినిధులు మాట్లాడుతూ తమ ప్రాంతానికి అనీల్ రాజు మంచి పేరు తేవాలని, మరింత ఉన్న శిఖరాలకు ఎదగాలని కోరారు. కార్యక్రమంలో మహారాణా, రాము, అశోక్, నాని, నారాయణరావు, భాస్కరరావు, జయంత్ మాస్టర్, కృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్‌ను విడుదల చేస్తున్న అనిల్‌రాజు తదితరులు

ఉద్దాన సమస్యలపై పోరాటం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

పోరాటాల పురిటిగడ్డ ఉద్దానంలో ఎన్నో అపరిష్కృత సమస్యలు ఉన్నాయని, వాటిపై ఉద్దానం ప్రజలు ఉమ్మడిగా సమరశీల పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. మండలంలోని పూండిలో విలేకరులతో శనివారం మాట్లాడారు. పాలకులు ఎందరు మారుతున్నా సమస్యలకు పరిష్కారం దొరకడం లేదని విమర్శించారు. అధికారం ఒక చేతి నుంచి, మరో చేతిలోకి మారడం తప్ప శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత పాశవిక పాలన సాగిస్తూ దోపిడీ శక్తులకు ఊడిగం చేస్తూ దేశ సంపదను కార్పొరేట్ దోపిడీదారులకు అమ్మేస్తున్నారని విమర్శించారు. రైతుల పంటలకు మద్దతు ధర ప్రకటించి చట్టబద్ధతను కల్పించాలని డిమాండ్ చేశారు. వంశధార శివారు భూములకు సాగునీరు అందించడంలో పాలకుల వైఫల్యం వల్ల ఐదేళ్లుగా సాగునీరు అందక పంటలు లేని పరిస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 22న మర్రిపాడు గణపతినగర్‌లో అమరవీరుల 45వ స్మారక సభను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐకెఎంఎస్ జిల్లా నాయకులు గొరకల బాలకృష్ణ, పిఒడబ్ల్యు నాయకులు పోతనపల్లి కుసుమ, రైతు కూలీ సంఘం నాయకులు రాపాక మాధవరావు, పిడిఎస్‌యు నాయకులు జగన్, ఇఫ్టూ నాయకులు బర్ల గోపి, అరుణోదయ నాయకులు కత్తుం ఢిల్లీరావు, న్యూడెమోక్రసీ కార్యకర్తలు అప్పన్న, గర్తం కామేశ్వరరావు, పోతనపల్లి మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రను కరువు ప్రాంతంగా ప్రకటించాలి

ప్రజాశక్తి- పలాస

ఉత్తరాంధ్ర జిల్లాలను కరువు జిల్లాలుగా ప్రకటించాలని శ్రీకాకుళం జిల్లా పౌర హక్కుల సంఘం నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం ఇచ్ఛాపురం నుండి వజ్రపుకొత్తూరు మండలం వరకు పర్యటించారు. ఈ సందర్భంగా వారు రైతులతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. సోంపేట, కంచిలి మండలాల్లో వర్షాలు పూర్తిగా లేక కొన్ని ప్రాంతాల్లో విత్తనాలే పూర్తిగా వేయలేదని, కొన్ని ప్రాంతాల్లో విత్తనాలు వేసినప్పటికీ దమ్ము పెట్టి వరి నాట్లు వేయలేదని తెలిపారు. మందస, పలాస మండలాల్లో వరి నాటిన తర్వాత వర్షాలులేక ఎండిపోయిన పరిస్థితి చూశామన్నారు. యుద్ధ ప్రాతిపదికన రైతులను, రైతు కూలీలను, వ్యవసాయ కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్రను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని, ప్రతి ఎకరానికి రూ.25 వేలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు రుణాలను మాఫీ చేసి కొత్త రుణాలను మంజూరు చేయాలని, ప్రత్యామ్నాయ పంటల కోసం శాస్త్రీయబద్ధంగా ఆలోచించి రైతులకు సూచన చేయాలని, ఎరువులు విత్తనాలు ఉచితంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్, ఉపాధ్యక్షులు పిండి వెంకటరావు, రామారావు, సహాయ కార్యదర్శి సోమనాథం, రామనాయుడు, కమిటీసభ్యులు లక్ష్మణ్, ఢిల్లీరావు, వైకుంఠరావు, సూరి పాల్గొన్నారు.

పంట పొలాలను పరిశీలిస్తున్న నిజ నిర్ధారణ కమిటీ సభ్యులు

19న అంబేద్కర్ జాతర

ప్రజాశక్తి- పొందూరు

ఈనెల 19న ఎచ్చెర్ల అంబేద్కర్ యూనివర్సిటీ ప్రక్కన నిర్వహించనున్న అంబేద్కర్ జాతరను విజయవంతం చేయాలని జిల్లా దళిత వేదిక అధ్యక్షుడు సాకేటి నాగరాజు పిలుపు నిచ్చారు. శనివారం పొందూరు అంబేద్కర్ కూడలిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించి అంబేద్కర్ జాతర కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ శ్రీకాకుళం పీజీ సెంటర్ అంబేద్కర్ యూనివర్సిటీగా సుమారు 28 సంవత్సరాలు కావస్తున్నా అంబేద్కర్ చైర్ స్థాపించడంలో పాలకులు విఫలమయ్యారని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం చొరవచూపి బడుగు, బలహీన వర్గాలకు ఉపయోగపడే అంబేద్కర్ చైర్ నెలకొల్పాలని డిమాండ్ చేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బొనెల అప్పారావు, సామాజిక న్యాయ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కల్లేపల్లి రామ్ గోపాల్, కులనిర్మూలన పోరాటసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిస్క కృష్ణయ్య, సామాజిక న్యాయపోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గణేష్, అంబేద్కర్ జాతర నిర్వాహక కమిటీ కన్వీనర్ టొంపల రమణ మాట్లాడారు. కార్యక్రమంలో కుమిలి రాజేష్, పోతయ్య, రేగిడి సతీష్, అగత లింగరాజు, వజ్రగడ తవుడు, రాము, బొడిరాజు, శ్రీను పాల్గొన్నారు.

నిబంధనలు సవరించాలి

ప్రజాశక్తి- పలాస

ప్రభుత్వం అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులకు ఇళ్లస్థలాల మంజూరులో నిరాశజనకంగా నిబంధనలు విధించడం పట్ల పలాస ప్రెస్‌క్లబ్ నాయకులు డి.మహరణ, రాము, హరి నారాయణ, నారాయణ, అశోక్ ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అనేక మంది జర్నలిస్టులకు అక్రిడేషన్లు లేకపోయినా వివిధ పత్రికల్లో పనిచేస్తున్నారని, వారికి కూడా ఇళ్లస్థలాలు మంజూరు చేయకుండా అక్రిడేషన్లు ఉన్న జర్నలిస్టులకు నిబంధనలు పెట్టి ప్రభుత్వం త్రిశంఖు స్వర్గం చూపిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. జర్నలిస్టు కుటుంబంలో ఎవరైనా ఉద్యోగం చేస్తే వారికి స్థలం ఇవ్వరాదని నిబంధన విధించడం సరికాదన్నారు. గతంలో ఏదైనా ప్రభుత్వ పథకం ద్వారా ఇళ్ల స్థలం లేదా ఇళ్లు పొందిన జర్నలిస్టులకు తాజాగా ప్రభుత్వ విడుదల చేసిన జిఒ ప్రకారం స్థలం మంజూరు చేయరాదని నిర్ణయించడం కూడా అన్యాయమన్నారు. మూడుసెంట్ల స్థలం విలువలో ప్రభుత్వం 60శాతం, మిగిలిన 40శాతం డబ్బులు జర్నలిస్టులు చెల్లించాలని పేర్కొనడం, ఆ స్థలంలో పదేళ్లలో ఇళ్లు నిర్మించకపోతే స్వాధీనం చేసుకుంటామనడం దారుణమన్నారు. ఈ విషయమై రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులు ఆందోళనకరంగా ఉన్నారని, ప్రభుత్వం స్పందించి నిబంధనలు సడలించాలని డిమాండ్ చేశారు.

15న జిల్లా పెన్షనర్ల సమావేశం

ప్రజాశక్తి- పొందూరు

ఈ నెల 15న రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం (న్యూ)జిల్లా శాఖ అత్యవసర సమావేశం శ్రీకాకుళం ఎన్‌జిఒ హోంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విభాగం అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.రామచంద్రరావు, అంకం ధర్మారావు ఒక ప్రకటనలో తెలిపారు. పెన్షనదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి పెన్షనదారులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

ఘనంగా ధన్వంతరి జయంతి వేడుకలు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండలంలో ధన్వత్రయోదశిని పురస్కరించుకొని శనివారం నాయీబ్రాహ్మణులు ధన్వంతరి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ భవనంలో నాయీబ్రాహ్మణ జిల్లా ఉపాధ్యక్షుడు నౌగాపు నాగరాజు ఆధ్వర్యంలో ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల, చిగురువలస లక్ష్మి, తెలగవలస శంకరరావు, వీరాస్వామి, శారద, జయలక్ష్మి, దమయంతి పాల్గొన్నారు.